చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు, రంగారెడ్డి జిల్లా అడిషనల్ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు, జడ్జీలు కిరణ్‌కుమార్, శ్రీదేవి తదితరులు

ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి హర్షణీయం

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్ రావు

చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఘనంగా ఖైదీల దినోత్సవం

చర్లపల్లి, అక్టోబర్ 2: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తూ.. కారాగారంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఖైదీల వేతనాలు జైళ్ల శాఖ పెంచడం అభినందనీయమని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ రావు అన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ జిల్లా జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి కిరణ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శ్రీదేవి, జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ ఐజీ రాజేశ్‌తో కలిసి ఆయన గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేయడంతో పాటు ఆదాయ వనరులపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు జైలు జీవితం అనంతరం స్థిరపడేందుకు ఆయా రంగాల్లో ఉపాధి శిక్షణ ఇచ్చి.. ఉపాధి అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. అనంతరం ఖైదీలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రామచంద్రం, అమన్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ అనిల్, ఇంజినీర్ మురళి, భాగ్యనగర్ డ్యాన్స్ అకాడమి ప్రతినిధి రవి, డ్యాన్స్ మాస్టర్లు సతీష్, రవిచంద్రా, సీనియర్ సినీ కామెడియన్ డాక్టర్ గౌతంరాజ్, సినీ ఆర్టిస్టులు ధన్‌రాజ్, శివప్రసాద్, ప్రమోదేవి, ఖైదీల వ్యవసాయక్షేత్రం సూపరింటెండెంట్ సమ్మయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్లు కాళిదాస్, రత్నం, శశికాంత్, శ్రీనునాయక్‌తో పాటు జైలర్లు, డిప్యూటీ జైలర్లు, జైలు సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఉన్నా.. వీరు అనాథలే..

డబ్బు, భూమిని లాక్కొని వదిలేసిన కన్న బిడ్డలు

రోడ్డుపైనే జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 2: ఈ వృద్ధ దంపతులు అందరూ ఉన్న అనాథలు. వీరికి నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు. చేతిలో ఉన్న డబ్బు, పోలాన్ని లాక్కొన్న వీరి సంతానం.. బయటకు నెట్టివేశారు. రోడ్డుపైనే జీవనం సాగిస్తూ.. ఎవరేమి పెట్టినా.. అది తింటూ బతుకు బండిని లాగుతున్నారు. వీరిని చూసిన ట్రాఫిక్ పోలీసులు, వాహనదారులు, ప్రజలు అయ్యో పాపం.. అంటూ వీరి దీన స్థితిని చూసి బాధపడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని మాసన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, నర్సమ్మ దంపతులు. వీరికి ఐదుగురు సంతానం. ఈ దంపతులు వృద్ధులు కావడంతో పిల్లలు వీరిని పట్టించుకోవడం మానేశారు. వీరి వద్ద ఉన్న భూమిని, డబ్బును తీసుకొని బాగోగులు చూడటంలేదు. బాధను దిగమింగుతూ.. మహబూబ్‌నగర్ నుంచి ఆరాంఘర్‌కు వచ్చిన ఈ దంపతులు రోడ్డుపైనే జీవిస్తున్నారు. గగన్‌పహాడ్ అండర్ పాస్ బ్రిడ్జి కింద తలదాచుకుంటూ.. ఎవరేమిచ్చినా.. అది తింటూ కాలం వెల్లదీస్తున్నారు. అదే ప్రాంతంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, హోంగార్డులు చిరంజీవి, శివకుమార్ ఈ దంపతులను గమనించి.. వారి దీనస్థితిని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. వీరి స్థితి తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు.. వారి కుటుంబాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించారు. ఏ ఒక్కరు కూడా స్పందించలేదు. దీంతో చేసేదేమి లేక.. ట్రాఫిక్ పోలీసులే ప్రతిరోజు ఈ దంపతులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనాన్ని తీసుకువచ్చి ఇచ్చి.. వారి ఆకలి తీరుస్తున్నారు.

గగన్‌పహాడ్ అండర్ పాస్ బ్రిడ్జి కింద తలదాచుకుంటున్న వృద్ధ దంపతులకు భోజనాన్ని అందిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు

వాహనాలు వెళ్లేలా మండపాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు

దారి చూపారు

ముషీరాబాద్, అక్టోబర్ 2: నాగయ్యకుంట వద్ద వాహనాలు వెళ్లేలా దారి చూపుతూ ట్రాఫిక్ పోలీసులు మండపాన్ని పక్కకు ఏర్పాటు చేయించారు. ఓ వైపు పైపులైన్ పనులు, మరోవైపు మండపం, ప్రత్యామ్నాయం చూపకుండా ట్రాఫిక్ మళ్లింపు.. పేరుతో 'నమస్తే తెలంగాణ)లో ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. నిర్వాహకులతో మాట్లాడి మండపాన్ని పక్కకు ఏర్పాటు చేయించారు. రెండు రోజుల కిందట ఓ పక్క పైపులైన్ పనులు చేపడుతుండగా.. మరోపక్క అమ్మవారి మండపాన్ని రోడ్డుపై ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని పక్కన ఏర్పాటు చేయించారు. దీంతో వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న యువకుడి అరెస్టు

మల్కాజిగిరి, అక్టోబర్ 2: గంజాయి మొక్కలను పెంచుతున్న ఓ యువకుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన వెంకట రాజు(19) కొంత కాలంగా ఆనంద్‌బాగ్ రైల్వే ట్రాక్ సమీపంలో గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వెంకటరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న పచ్చి గంజాయి మొక్క కొమ్మలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించడంతో.. రైల్వే ట్రాక్ సమీపంలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు తెలిపాడు. పోలీసులు రెండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

బాలుడిపై వీధి కుక్క దాడి

దుండిగల్, అక్టోబర్ 2: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కలు మరోసారి రెచ్చిపోయాయి. ఇంటి సమీపంలోని కిరాణా షాపులో పాలపాకెట్ కొనుగోలు చేసేందుకు వెళ్లిన ఏడేండ్ల బాలుడిపై ఓ వీధికుక్క దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. వివరాల్లోకి వెళితే.. బొరంపేట గ్రామపంచాయతి సమీపంలో జేమ్స్ ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. బుధవారం ఉదయం పాల పాకెట్ తీసుకురమ్మని జేమ్స్ తన ఏడేండ్ల కుమారుడైన జశ్వంత్‌ను కిరాణా దుకాణానికి పంపించాడు. జశ్వంత్ పాల పాకెట్ తీసుకుని.. ఇంటికి వస్తుండగా అక్కడే ఉన్న ఓ వీధి కుక్క అతడిపై దాడి చేసింది. జశ్వంత్ తొడను (పీకడం) కరవడంతో తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు కుక్కను అక్కడి నుంచి తరిమేసి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే బాలుడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ క్లీనిక్‌లో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం నారాయణగూడలోని ప్రత్యేక వైద్యశాలకు తరలించారు. అయితే, బొరంపేటలో ఇటీవల వీధి కుక్కల బెడద అధికమైందని, వాటి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపానపోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కుక్కల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ రావు స్పందించారు. బ్లూ క్రాస్ సొసైటీ ప్రతినిధులను పిలిపించి.. ఆ ఏరియాలో ఉన్న కుక్కలను దగ్గరుండి పట్టించారు. కుక్కలకు పిల్లలు పుట్టకుండా స్టెరైజేషన్ చేయడం జరుగుతుందని, యాంటీ రేబిస్ టీకా కూడా వేయిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు ఎక్కడున్నా వెంటనే మున్సిపాలిటీ ఫోన్ నంబర్ 9542715377, 903009539కు కాల్ చేసి సమాచారమివ్వాలన్నారు. కుక్క కరిచిన బాబుని మున్సిపల్ కమిషనర్ పరామర్శించారు. ప్రస్తుతం అన్ని స్కూళ్లల్లో పిల్లలకు వీధి కుక్కలపైన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

జంట కమిషనరేట్ల పరిధిలో గాంధీ జయంతి వేడుకలు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అవినాశ్ మహంతి, నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సుధీర్‌బాబు గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవీస్, రాచకొండ అడ్మిన్ డీసీపీ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

పండుగ షాపింగ్‌కు వెళ్లిన వ్యక్తి మృతి.. కేసు నమోదు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 2: పండుగ షాపింగ్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్ టౌన్‌కు చెందిన కలాల్ ప్రవీణ్‌కృష్ణ, తేజ దంపతులు. ప్రగతినగర్ రాజీవ్ గృహకల్పలో ఉంటున్నారు. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. ప్రవీణ్‌కృష్ణ హుందాయ్ సంస్థలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో ప్రగతినగర్ రోడ్డులోని ఓ షాపులో దుస్తులు కొనడానికి వెళ్లి.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.

గమనించిన షాపు నిర్వాహకుడు సమీపంలోని వైద్యశాలకు తీసుకెళ్లగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరీక్షల ఒత్తిడితో ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 2: పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్ బషీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. కొంపల్లిలోని శ్రీనివాస్‌నగర్ ప్రాంతానికి చెందిన నవీన్‌రాజు (21) లా చదువుతున్నాడు. పరీక్షలు ఉండటంతో తీవ్ర ఒత్తిడికి గురై.. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి.. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమిష్టి కృషితో కాయకల్ప అవార్డు

అమీర్‌పేట, సెప్టెంబర్ 2: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన నిర్వహణ పద్ధతులు అవలంభిస్తున్నందుకు ఇచ్చే కాయకల్ప (ఈకో ఫ్రెండ్లీ) అవార్డు అమీర్‌పేటలోని 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి దక్కించుకుంది. ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును అమీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకోవడం వరుసగా ఇది మూడో సారి. ఆగస్టు నెలలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా సంస్థకు చెందిన అధికారులు అమీర్‌పేట ఆస్పత్రిని సందర్శించారు. ఇక్కడి పరిసరాల్లో పచ్చదనం, పారిశుధ్యం నిర్వహణ, ఆస్పత్రిలోని టాయ్‌లెట్లు, పిల్లలు, పెద్దల వార్డులు, ఆపరేషన్ థియేటర్లలో పరిశుభ్రత అంశాలు, ప్యాథాలజీ ల్యాబ్‌లలో జరిగే వైద్య పరీక్షల సమయంలో అనుసరిస్తున్న సురక్షిత విధానాలు, బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ పద్ధతుల వంటి వాటిపై స్వచ్ఛభారత్ అధికారులు ఇక్కడి వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రకటించిన ఈ అవార్డుతో అమీర్‌పేట ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫూఫ్, ఆర్ఎంవో డాక్టర్ వినాయక్ మాట్లాడుతూ.. కాయకల్ప అవార్డును సొంతం చేసుకోవడం ఇది వరుసగా మూడో సారి అని చెబుతూ, గతంలో ఈ అవార్డు ద్వారా వచ్చిన రూ.6 లక్షల నగదును ఆస్పత్రి అభివృద్ధికి వెచ్చించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరి కృషి వల్లే ఈ గుర్తింపు వచ్చిందన్నారు.

మహాత్మా ఒక్కసారి మాట్లాడు

గాంధీ విగ్రహానికి తప్పని బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మెహిదీపట్నం, అక్టోబర్ 2: జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి గతంలో ఎప్పుడూ జరుగని అవమానం జరిగింది. లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీజీ విగ్రహాన్ని కూడా బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ తనిఖీలు చూసిన ప్రతి ఒక్కరూ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో గాంధీ విగ్రహానికి తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్ సిబ్బంది

ఉప్పల్‌లో 16 సెల్‌ఫోన్ల రికవరీ

బాధితులకు అప్పగింత

ఉప్పల్, అక్టోబర్ 2: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బాధితులు పోగొట్టుకున్న రూ.3.20 లక్షల విలువ చేసే 16 సెల్‌ఫోన్లను పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఆ 16 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి వివరాలను వెల్లడించారు. రియల్‌మీ 4, వివో 3, ఒప్పో 3, రెడ్‌మీ 2, వన్‌ప్లస్ 2, సామ్‌సాంగ్, ఐక్యూ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సెల్‌ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభచాటిన సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం.. పలువురి అరెస్టు

పీర్జాదిగూడ, అక్టోబర్ 2: రాజకీయ నేతలతో పరిచయం ఉన్నదని, రెవెన్యూ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసి డబ్బులతో ఉడాయించిన పలువురిని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లి విహారిక కాలనీలో నివాసముంటున్న మావురప్ప గోపాల్‌కు వనస్థలిపురం నివాసి ప్రవీణ్ రెడ్డి(24), సాయి(25), శాలిబండకు చెందిన కిరణ్‌కుమార్ రెడ్డి(38), ఈసీఎల్ నివాసి ప్రవీణ్, వేణు, సంజీవు స్నేహితులు. వీరు తమకు రాజకీయ నేతలతో పరిచయం ఉన్నదంటూ గోపాల్‌తో చెప్పారు. గోపాల్ భార్య శ్రావణికి ప్రభుత్వ రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పారు. మాటలతో నమ్మించి కొన్ని రోజుల తర్వాత ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్‌ను చూపించి, బాధితుడి వద్ద నుంచి రూ.8లక్షలు కాజేసి ఉడాయించారు. అపాయింట్‌మెంట్ లెటర్ ఫేక్ అని తెలుసుకున్న గోపాల్ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం పీర్జాదిగూడ కమాన్ వద్ద నిందితులు భూస ప్రవీణ్, కిరణ్‌కుమార్ రెడ్డి, వంచ ప్రవీణ్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక కారు, మూడు సెల్‌ఫోన్లు, గ్రీన్ కలర్ పెన్, ప్రింటర్ మిషన్, ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ లెటర్ స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. 2023లో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ల్యాండ్ కేసులో పలువురిని మోసం చేసి జైలుకు వెళ్లిన ప్రవీణ్ పాత నేరస్థుడని పోలీసులు తెలిపారు.

హైదర్‌గూడలో మద్యపానం నిషేధంపై తీర్మానం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 2: మద్యం సేవించడం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయంటూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు పేర్కొన్నారు. మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తేనే సమాజం బాగుపడుతుందని మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా హైదర్‌గూడ వాసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. శుభ కార్యాలు, దావత్‌లలో మద్యపానాన్ని నిషేధిస్తూ తీర్మానించారు. అన్ని సామాజిక వర్గాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమిష్టిగా దావత్‌లలో మద్యపానం జోలికి వెళ్లరాదని, నిర్వాహకులు మద్యం ఇవ్వవద్దని ప్రతిజ్ఞ చేయించారు. పెండ్లీలు, డిన్నర్లు వంటి కార్యాలు, బహిరంగంగా మద్యపానం సేవించడం వల్ల మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, యువతరంపై చెడు ప్రభావం చూపుతోందని ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. దావత్‌లలో మందు బంద్ చైతన్య ఉద్యమం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ నుంచి ప్రారంభమైందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో ఈ నిషేధం అమలుకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కొలన్ సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వరరావు, నారగూడెం మల్లారెడ్డి, మోండ్ర కొమురయ్య, వనం నర్సింహ, చిటిగారి చిన్న, నరేందర్, సోమారం రాజ్‌కుమార్, కార్పొరేటర్ సంగీత, మాజీ కౌన్సిలర్ సోమారం రవీందర్, ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోండ్ర నర్సింహ, బర్ల మల్లారెడ్డి, కొలన్ సుధాకర్, మద్దూరి బాలసుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త, జర్నలిస్టు మ్యాడం మధుసూదన్, రావుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మత పరమైన ఉరేగింపుల్లో.. డీజే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదు

ఉత్తర్వులు జారీ చేసిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో మత పరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై నిషేధం విధిస్తూ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజే సౌండ్ నుంచి అధిక డెసిబుల్స్‌లో వచ్చే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధిత ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉన్నాయని, చిన్న పిల్లలకు శాశ్వత వినికిడి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నట్లు పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయన్నారు. ప్రధానంగా వృద్ధుల ఆరోగ్యం దెబ్బ తింటుందనే కారణంతో రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉరేగింపుల్లో డీజే సౌండ్ మిక్చర్లు, యాంప్లిఫయర్, బాణాసంచా ఉపయోగించడాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ వివరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే బీఎస్ఎన్ 223, 280, 292, 293, 324, బీఎన్ఎస్ఎస్ 152, పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని, నిబంధనలు అతిక్రమించిన వారికి ఐదేండ్ల జైలు శిక్ష, లక్ష జరిమానా ఉంటుందని కమిషనర్ తెలిపారు. ప్రజలకు, విధుల్లో ఉండే అధికారులకు కలుగుతున్న ఇబ్బందులు, డీజే సౌండ్ సిస్టమ్‌తో తలెత్తుతున్న సమస్యలను విశ్లేషించి అందరి అభిప్రాయాలను తెలుసుకున్న తరువాతే ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.

న్యాయవాదుల డిమాండ్లను పరిష్కరించాలి

సుప్రీం కోర్టు న్యాయవాది కేఎస్ కృష్ణ

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 2: న్యాయవాదుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సుప్రీం కోర్టు న్యాయవాది కేఎస్ కృష్ణ అన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా కోర్టు బార్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు లీగల్ ఇండియా ఫ్రంట్ పక్షాన ఆయన మద్దతు పలికి, దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. సెక్షన్ 35 బీఎన్ఎస్ఎస్, సెక్షన్ 41ఏ సీఆర్‌పీసీలను రద్దు చేయడంతో పాటు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, టెన్యూల్ పీపీ వ్యవస్థను పునరుద్ధరించాలని, జూనియర్ న్యాయవాదులకు స్టయిఫండ్ ఇవ్వాలనే న్యాయమైన డిమాండ్లను తక్షణమే అమలు చేయాలన్నారు. న్యాయవాదుల డిమాండ్ల పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్షకైన వెనుకాడబోనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వై. కొండల్‌రెడ్డి, శశికాంత్ మడుపు, గంగారెడ్డి, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న సుప్రీం కోర్టు న్యాయవాది కేఎస్ కృష్ణ

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కేరళ మహం మాంత్రికుడు
★ కేరళ మహం మంత్రికుడు స్త్రీ పురుష వశీకరణ స్పెషలిస్ట్ పండిత్ విశ్వరాజ్ : భార్యాభర్తల కలహాలు, శత్రు నాశనం, ప్రేమ సమస్యలు & మీ ఎటువంటి సమస్యలకైనా 5 గంటల్లో 100% పరిష్కారం. ఫోన్‌లో పరిష్కారం చేయగలరు. 8121931984.
NT-334815

GOLD FINANCE

★ మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-335055

TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్: 12/10 సోమనాథ్ + 3 జ్యోతిర్లింగాలు 8 క్షే; 06/11 కార్తీకంలో కాశీ యాత్ర 9 నిద్రలు; 25/11 రామేశ్వరం యాత్ర 25 క్షే; 16/11 కామాఖ్య యాత్ర 7 క్షే; 10/12 సిమ్లా, మనాలి + నవదేవీలు @ 9908844377.
NT-336721

INSURANCE
★ Become an Life Insurance Advisor with TATA-AIA. Work from anywhere 100% Digitally. Unlimited Income, Growth & International Trips Every Month. Part Time / Full Time. Call / WhatsApp: 9505931826.
NT-338861

PLOT FOR SALE

★ నాగార్జునసాగర్ హైవే యాచారం టౌన్‌లో గజం: రూ. 8,990/- DTCP అప్రూవల్ లేఅవుట్‌లో & కడ్తాల్ మైసిగండి దగ్గర గజం: 9,990/-. స్పాట్ రిజిస్ట్రేషన్, 25% పేమెంట్ చేసిన వారికి 5 గ్రా॥ గోల్డ్ ఫ్రీ. Ph: 9014297729, 8919631310.
NT-333139

PLOT FOR SALE
★ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బీబీనగర్ టౌన్, AIMSకు అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే॥క॥, ఆల్ డె॥, స్పాట్ రిజి॥, బ్యాంక్ లోన్, ఫ్రీ సైట్ విజిట్. Ph: 9912357546.
NT-336726

FLAT FOR SALE

★ కమర్షియల్ 2BHK, 1129 Sft., వెంకటాద్రి థియేటర్ బ్యాక్ సైడ్, దిల్‌సుఖ్‌నగర్, JNTU నిజాంపేట్ రోడ్‌లో హైటెన్షన్ రోడ్ 2BHK, 1015 Sft., W/F & చైతన్యపురి ఫణిగిరి కాలనీ 2BHK, 980 Sft. Ph: 9550615070.
NT-338